

# ఘటన

వీడి పేరు, "శంకరం." వీడిపేరు ఇదని తెలిసినవాళ్లు మా ఊళ్ళో చాలా అరుదు. అందరూ వీడిని, "తమ్ముడూ" అనే పిలుస్తారు. వీడి అక్కయ్యలూ, చెల్లెళ్లూ, అన్నయ్యలూ, తమ్ముళ్ళూ, బావలూ, మరదళ్ళూ ఒకళ్లేమిటి, ఇంట్లో అందరూ కూడా ఇలాగేపిలుస్తారు. ముఖ్యంగా, తల్లి కూడా "తమ్ముడూ" అంటూనే పిలుస్తుంది.

ముచ్చటగా శంకరం అనే పేరుంటే— వెధవది ఇదేంపేరు?" అని విసుక్కుంటూనే ఉంటాడు పాపం మా వాడు.

ఈ విధంగా ఇంట్లో అందరితో పాటు మాకూ అలవాటయిపోయింది వాడిని లా పిలవడం. మాతోపాటు, కిళ్ళీకొట్టు రంగయ్యకి, కిరాణాకొట్టు పెద్దకాపుకి, ఫ్యాన్సీ షాపు అప్పలరాజుకి, వగైరా వగైరా లందరికీ కూడా ఇదే అలవాటు. వీళ్ళందరినీ నమిలి మింగేద్దామన్నంత కోపంతో లోలోపల మండిపోతూ ఉంటాడు పాపం మా శంకరం గరళకంఠుడిలాగ- కక్కా లేడు, మింగాలేడు.

సన్నంగా, పొడుగ్గా, ఎఱ్ఱగా ఉంటాడు. మధ్యపాపిడితో నల్లని జుట్టు. కనుబొమ్మల మధ్య చిన్న తిలకంబొట్టు. దళసరి కళ్ళద్దాలజోడు; కాళ్ళకి అకుజోడు. తెల్లాటి బట్టలు, కొళ్చన్ మార్కులా వంపుతిరిగిన నడుము. ఇదీ శాల్తీ.

చేతిలో సంచి. నోట్లో బీడీతో బయలుదేరుతాడు పొద్దున్నే మార్కెట్టుకి.

"ఏమోయ్ ! వంకాయలు వీశ ఎలాగ?" మార్కెట్టులో శంకరం !

"ఈశెలు లేవుగా దాబూ....గాములు !" అంగడివాడు, పొరపాటు సవరిస్తాడు !

"అబ్బ ! అదేనోయ్. వీశకు సరిగా సరిపోయే తూకానికి ఖరీదెంతా, అని అడుగుతున్నా!" గ్రాముల లెక్క తెలియని శంకరం చిరాకు.

"ఓహో....అదా బాబో !....పదకొండణాలు !"

"అణాలు లేవ్గా నాయనా !....పైసలు!" కోపంతో వెక్కిరింపు!

"ఏమో బాబూ ! పైసాలు లెక్కెట్టుకోడం సరీగా తెలిసి సావదు మాకు...." కొట్టువాడి సంజాయిషీ పూర్తికాకుండానే,

"ఓ !....తెలివితేటలకేమీ లోటులేదు - పైసల లెఖ్ఖ తెలియదుట-నిన్నగాక మొన్నొచ్చినగ్రాములు తెలిసిపోయాయి - డబ్బు దగ్గిర పుట్టుకొస్తాయి ఎక్కడలేని తెలివితేటలూనూ - వెధవలు...." నెమ్మదిగా విసుక్కుంటూనే ఇంకో కొట్లో దూర్తాడు !- నా-వాడికి యిలాంటి తిక్కపనులుమామూలేలెండి ! వీటిలో కొంచెం తక్కువయినా ఇంట్లో జాస్తీమే ! ఏదో ఓ రెండుకూరలు కొనుక్కొని ఇల్లు చేరక యెందుకుచెప్పండి వీటికి వ్యర్థప్రసంగం?

ఎలాగో మార్కెట్టుపని ముగించి, తిరిగి వచ్చేటప్పుడు దారిలో రంగయ్య కొట్టుమీద ఓ అణా బీడీలు, ఒక వక్కపొడి పొట్లాం తీసుకొని మరీ ఇంటి కొస్తాడు ! ఈ బజారు పని చూడడం మావాడికి కాలకృత్యం లాంటిది !

• • •

వీడు పుట్టడం ఒక శుభ సమయంలోనే పుట్టాడు ! కానయితే, వీడి ఆరేడు సంవత్సరాల వయసులోనే తండ్రి పోయాడు ! తల్లే రెండుస్థానాలూ ఆక్రమించి, వీడిని

ఆకొండి వెంకటరత్నం

పెంచి పెద్దచేసింది. అల్లారుముద్దుగా మాత్రం కాదు! అమ్మంటే భయం కూడా ఉంది వీడికి!

ఓనాడు— అంటే మేం గోచీల బళ్ళో చదువుకునే రోజుల్లో— ఆడుకుందుకు పిలుద్దామని వాళ్ళింటికెళ్ళాము.

"తమ్ముడూ, ఒరే.....తమ్ముడూ,....." అంటూ అయిదారుసార్లు పిలిచాం! అంతే మహాకాళిలా వచ్చింది వాళ్ళ పెద్దక్క. చేతిలో చిన్నచీపురుంది.

"ఏమిట్రా కూస్తున్నారు? దొంగపీనుగుల్లారా?— నాకు తమ్ముడైతే మీకూ తమ్ముడట్రా? గాడిదలూ ...." అంటూ చీపురు తిరగేసి పైపైకొచ్చేస్తోంది. (మహాకోపం లెండి ఈ మహంకాళికి).

ఎందుకేనా మంచిదని దూరంగా పారిపోయి, చెయ్యి పైకీ క్రిందకీ ఆడించి—

"మరి నీకు తమ్ముడైతే, మీ అమ్మకీ, ఊరందరికీ ఎలా అయ్యాడేం? మమ్మల్నాడిపోసుకుంటావు?" అన్నాడు కిష్టిగాడు!

"నోర్మూయ్ వెధవ్వా!" అంటూ వాడి మీదకి పంగె త్తింది కాళీమాత! వాడు తుర్రుమన్నాడు; మేమూ అనుసరించాం.

అలా మేము తమ్ముడూ అని పిలవడం వాడికి యిష్టంలేదని ముందే చెప్పానుగా! కసి ఉందిగాని ఏం చెయ్యలేదు! అంచాత ఈ మహంకాళిని వాడే మామీదకి తోలాడని అనుకున్నాం—

మాష్టర్లని ఏడిపించటం అంటే మా వాడికి భలే సరదా! ఆప్రైములో ఎక్కడలేని మొండి ధైర్యం ఆవరించుతుంది వాడిని! గోచీలబళ్ళో మాష్టర్ల దగ్గిర్నించి, కాలేజీ లెక్చరర్లదాకా వీడి బాధననుభవించారు!

"ఆ, ఆలు దిద్దరా అంటే," "కాగుణింతం కావాలి మాష్టారూ అనేవాడు ఒకటో క్లాసులో!

పాఠం బాగా సాగుతూంటే, "ఒంటేలు సార్" అనేవాడు ఒకటో ఫారంలో—

పోగా పోగా ఓనాటికి స్కూలుఫైనల్లోకి వచ్చాడు. ఓరోజు స్కూలు తనిఖీకి, ఇనస్పెక్టరుగారొచ్చారు. రాగానే మావాడి క్లాసే ప్రవేశించారు: ఆరోజు మొదటి లీడరు సెలవు. వీడురెండో లీడరు.

ఇన్స్పెక్టరుగారు రాగానే వేసిన ప్రశ్న "ఎవరు ఈ క్లాసు లీడరు?" అని.

నుంచొని, "నేను సార్!" అన్నాడు తమ్ముడు!

"నువ్వు నాయకుడివా? వినాయకుడివా?" అని ఠక్కున అడిగేశారు! వీడి కళ్ళజోడూ, వాటం చూసి అలా అడగాలనిపించి నట్టుందాయనకి! (మొట్టికాయలతో బుఱ్ఱ వేడెక్కిపోయి, కళ్ళలోకి దిగి, ఆమధ్య ఓ కళ్ళజోడు ప్రాప్తించింది లెండి).

వీడు తెల్లబోయాడు! ఆలోచించి, ఆలోచించి, చివరికి, "నేను వినాయకుడినే సార్!" అన్నాడు!

క్లాసంతా గొల్లుమంది! ఆయన రెచ్చిపోయారు!

"తొండంలేదు, దంతాల్లేవు, బొజ్జలేదు, నాలుగు కాళ్ళూ లేవు, నక్కవాటం నువ్వూను; నువ్వు వినాయకుడివేమిటి?" అంటూ వీడ్ని ముందు కానిచ్చి, తర్వాత స్కూలంతటినీ దుమ్మెత్తారు!



"ఏమిటండి, మీ ప్రశ్నలు?" అని ఇన్స్పెక్టరుగారిని అడిగే ధైర్యంలేని హెడ్మాష్టారు,

"బోడివెధవా! ఏమిట్రా ఆ సమాధానాలు? తిన్నగా చెప్పలేవూ? ఇలాంటితిక్కపనులు చేస్తే టి. సి. ఇచ్చి పంపేస్తాను జాగ్రత్త!" కోపం నటిస్తూ మావాడిని కసిరాడు!

"ఒకవేళ వినాయకుడంటే కూచుని తినేవాడూ, నాయకుడంటే పనిచేసేవాడూ, అనే ఉద్దేశ్యంలో అడగలేదుగదా ఆయన?.. నాయకుణ్ణని చెప్పవలిసింది!.... పొరపాటైపోయింది...." అని తర్వాత తీరిగ్గా అనుకున్నాడు!

● ● ●

వీడి మరదలు పేరు, 'మంగతాయారు' ఈ తాయారంటే మా శంకరానికి చాలా చాలా కోపం! మామూలు మరదలైతే అంత కోపం ఉండకపోను! కాని, ఆ అమ్మాయిని వీడికి కట్టబెడదామనుకుంటున్నారు వీళ్ళ పెద్దలు. మరి అటువంటప్పుడు, అస్తమానూ, ఆతాయారు వీడిని 'తమ్ముడూ, తమ్ముడూ'. అని ఉడికించుతూంటే ఏం బావుంటుంది చెప్పండి? ఏదో ఒకసారి, రెండుసార్లూ! అంతేగాని, కాబోయే మొగుణ్ణి పట్టుకొని పూసతాయిస్తే ఏ మగాడు ఊరుకుంటాడు చెప్పండి? ఊరుకోలేడు కూడా. అందుకే మా శంకరం తాయారుమీద అంతగా కోపగించింది! అంతేకాదు! ఓ శుభముహూర్తాన, "ఈ బోడి తాయారుని పెళ్ళిచేసుకోను!" అని నిశ్చయం చేసుకున్నాడు కూడా! తాయారు శెలవుల్లో వీళ్ళింటికొస్తే, మునుపటిలా ఆడుకుందికి పరిగెట్టడం మానేశాడు. తప్పుకు తప్పుకు తిరిగేవాడు. ఓ మూల భయం పీకుతున్నా తాయారంటే కోపమే!—

అయిదేళ్ళపాటు, ఇంటిపోరులేకుండా, స్వేచ్ఛగా కాలేజీ జీవితం అనుభవించాడు! (ఇంటి పోరుకి ఇల్లాలే ఉండక్కరలేదుగా! తల్లిపోరు కూడా భరించలేడు వీడు.) కాబోయే ఇల్లాలిపోరుకూడా లేదు యీ అయిదేళ్ళూ! తదనంతరం ఓ డిగ్రీముక్క చేతబుచ్చుకొని, బీడీముక్క నోట కరచుకొని, కాలేజీ వదలి ఇల్లు చేరాడు!

ఉద్యోగాలకోసం ప్రయత్నాలు చెయ్యకపోలేదు! కాని వీడి పర్సనాలిటీ చూసి ఉద్యోగం యీయడానికి జడిశారు, అధికారులంతా!

"ఆఁ .... ఈ రోజుల్లో ఉద్యోగాలెక్కడ దొరుకుతున్నాయిలెద్దూ!- తిండికి లోటు లేకుండా ఆస్తిఉంది! మనకి ఉద్యోగం ఎందుకు?" అనేసుకుని, బీడీ ముట్టించి, హాయిగా దమ్ములాగేవాడు!

ఈ మధ్య ఓ చల్లని సాయంత్రం, ఉసిరిచెట్టు మొదలుకు జారబడి, తదేకధ్యానంతో ఒక డిటెక్టివ్ నవల చదువుతున్నాడు తమ్ముడు! ఇంతలో....

"నాయనా!.... తమ్ముడూ!" అని దగ్గర్లో వినిపించింది!

"ఛీ! మంచి సస్పెన్సులో ఏమిటీ న్యూసెన్సు?" అని కసురుదామని ఇటు తిరిగాడు! ఆ పిలిచింది మాతృమూర్తని తెలిసి, మాటలు మింగేసి, ఏమిటన్నట్టు చూశాడు!

ఉపోద్ఘాతం గట్రా లేకుండా చెప్పేదేదో సూటిగా చెప్పడం మొదలెట్టిం దావిడ! "మామయ్య ఉత్తరం రాశాడురా! ఈ

మాఘమాసంలో మంచి ముహూర్తాలున్నా యిట. పెట్టిస్తానంటున్నాడు! ఏమంటా వురా నాయనా?"

"అమ్మా! ఏమిటి? ఆ తిక్కమంగమ్మని నేను పెళ్లాడనామ్మా?....అసంభవం!" అని శంకరం నోట్లోంచి గట్టిగా రాబోయిన మాటలు, భయంతో లోపలికి పోయి, "అమ్మా....ఆ తాయార్ని....నేను....పెళ్ళి చేసుకోనే...." అని నసుగుతూ బయటికి వచ్చాయి!

"హేడిశావుగాని నాగమ్మా, వెంటనే ముహూర్తం పెట్టించమని రాస్తాను" అని నవ్వుతూ అనేసి వెళ్ళిపోయిం దావిడ!

పుస్తకంలో ఉన్న తల పైకి తీయ కుండానే... "అ....అమ్మా....అదంటే నాకు....భయమే...." అన్నాడు నెమ్మదిగా. సమాధానం రాకపోడం చూసి, తలెత్తాడు! తల్లిలేదుగా అక్కడ! "నయమే! వింది గాదు!" అనుకొని, కోపంగా,

"ఎలా చేస్తారో చూస్తాను! నాకిష్టం లేకుండానే పెళ్ళిచేస్తారేం వీళ్ళు? పెళ్ళట! పెళ్ళి చేసుకోక చేసుకోక ఇలాంటిదాన్నే చేసుకోవాలి ఖర్మకాలి? జిడ్డోడుకుంటూ మొహం ఇదీను! చీమిడిముక్కు పిల్ల భ.. తలుచుకుంటేనే వికారం! దీన్నా నేను చేసుకోవడం! అదీకాక దానిపేరు చెబితేనే ఎక్కడలేని భ....ఛ్ఛీ! భయమేమిటి? దాని మొహం! అది, నన్నేం చేస్తుందని భయం?... ఛీ....ఛీ.... ఇలాంటి దాన్ని నేనెందుకు పెళ్ళాడాలి?—— ఎలాగైనా ఈ పెళ్ళి తప్పించెయ్యాలి! కాని! ఎలాగ? ఎలాగ?.... ఎలాగా?" మా శంకరానికి ఆరురోజుల దాకా ఇవే ఆలోచనలు!

ఏడోనాడు వీడిపేర ఓఉత్తరంవచ్చింది! "రాతపరిచయంలేనిది! కాని, ఈ అక్షరాలు అక్షరాల్లా లేవు— ముత్యాలు!!.... ఓ హో హో...." అనుకున్నాడు కవరు చూస్తూనే!

"ప్రియమైన శ్రీ శంకరంగారికి,
అనేక నమస్కారములు!"

"ఎవరు గారో?" అనుకుంటూ కవరు విప్పాడు. ఓ చిన్న ఫొటో కింద పడింది. తీసి చూశాడు!

"అహా! ఇది ఫొటోకాదు! దేవకన్య ప్రతిరూపు! నిజంగా ఈ ఫొటోలో అమ్మాయి చాలా అందంగా ఉంది! ఆ కోలముఖం, సంపెంగ ముక్కు, చిన్ని గడ్డం, పెద్దపెద్ద కాటుక కళ్లు—ముఖానికి, పెద్ద తిలకంబొట్టు పెట్టుకుంది! గడ్డంమీద నల్లమచ్చ ఉంది - అది పుట్టుమచ్చో, బ్యూటీ స్పాటో? ఆ ముక్కుమీద, మొలక మొలిచినట్టు చిన్న ముక్కుపుడక కూడా ఉందే! ఆ కళ్ళు, అందంగా ఎందుకు నవ్వుతున్నాయో? ఆ పొడుగాటి జడ బాగా కనిపించాలని ముందుకి వేసుకొని మరీ తీయించుకుంది ఫొటో! సినిమా హీరోయిన్లను కూడా మరిపించే అందం సుమా! - నిస్సందేహంగా దేవకన్యే!! కాని, నాకెందుకుపంపిందబ్బా ఆ అమ్మాయి, అనుకుంటూనే కాయితం తీశాడు! మళ్ళీ ముత్యాలు ప్రత్యక్షం!! చదవడం మొదలుపెట్టాడు!

"ఎవరో చాలా మంచిదానిలా ఉంది! "తమ్ముడూ" అనకుండా, అందమైన అక్షరాలతో 'శంకరంగారూ' అంది ముచ్చటగా! తప్పకుండా ఈ ఉత్తరం ఫొటో



కట్టించుకోవాలి!" అనుకుని మళ్ళీ మొదలుపెట్టాడు ఉత్తరం!

"నేనెవరినని ఆశ్చర్యపోతున్నారా! ఆలోచించండి! జ్ఞాపకం వచ్చానా?"

తెల్లబోయాడు ఏమీ అర్థంకాక!

"ఏమిటండీ అలా తెల్లబోయిచూస్తారు?- గుర్తురాలేదుకదూ? ఫొటో మళ్లీ ఓసారి జాగ్రత్తగా చూడండి! ముందు చూసి, తర్వాత నా ఉత్తరాన్ని పూర్తిచెయ్యండి!"

"రామచంద్రా!" అనుకుని మళ్ళీ ఫొటోని చూడ్డం ప్రారంభించాడు. పెద్ద డిటెక్టివ్‌లాగ వివిధకోణాల్లోనూ పరిశీలించాడు! ఫొటో తలక్రిందులుగా కూడా చేసి చూశాడు! అంతు దొరకలేదు!

"ఎవర్రోబాబూ ఈ అజ్ఞాత సుందరి!" అనుకుంటూ ఉత్తరం తీశాడు ఇంక ఎంతసేపు చూసినా ఫొటో అంతుతేలదని!

"ఏమండీ, శంకరంగారూ తెలిసిందా నేనెవరో?.... పోనీ....అందంగా ఉన్నానా?"

"ఎవర్తిరాబాబూ యిది? సిగ్గూ ఎగ్గూ లేనిదానిలా ఉంది!" అనుకొని, మళ్ళీ మొదలుపెట్టాడు చదవడం!—

"నన్ను మీరు మరచిపోయారు శంకరం గారూ! నన్ను, మా అమ్మ 'మంగా!' అంటుంది! మా నాన్న, 'మంగళాంబా!' అంటారు. మా బామ్మ, 'తాయారూ' అని, మా అత్తయ్య, పూర్తిగా, 'మంగతాయారూ' అనీ అంటారు! ఇంక మా బావ ఉన్నాడు చూశారూ "మంగమ్మా!" అంటాడు....!"

"ఓసి తాయారూ, నువ్వేటే?! ఎంత దానవయ్యావ్!!" అని ఆనందంగా అనేసుకొని, మళ్ళీ ఫొటో తీశాడు. ఫొటోలో తాయారు, చిలిపిగా చూస్తూ, కొంటెగా నవ్వుతోంది!

"ఏమిటీ, ఇది తిక్కతాయారు ఫొటోయే?" మళ్ళీ ఫొటోలోకి చూశాడు; అనుమానంగా కళ్ళు చిట్లించాడు; కళ్ళు మూసుకొని, ఐదు సంవత్సరాలనాటి తాయార్ని మనసులో ప్రదర్శించుకున్నాడు. చింపిరి జుట్టూ, చీమిడి ముక్కూ, గజ్జి చేతులూ - యిదీ అవతారం! మళ్లీ ఫొటోలోకి చూశాడు! "రేపు తనతో పెళ్ళికాబోతోందామెను! ఎవరి ఫొటోయో ఎందుకు పంపుతుంది? తాయారు ఫొటోయే అయి ఉంటుంది!" మళ్లీ ఫొటోలోకి చూస్తూ దీర్ఘాలోచనలో మునిగి పోయాడు!- సృష్టిరహస్యం ఏదో తెలుసుకున్న వేదాంతిలా వాడి ముఖం వికసించింది. రజస్వలానంతరం, స్త్రీ స్వరూపంలో కలిగే వింత మార్పులకి, నివ్వెరబోయి, దేవుడిని అదేపనిగా మెచ్చుకున్నాడు.

తాయారు అందానికి, ఆ ముత్యాలరాతకి ముగ్ధుడైపోయి ఏదో చేద్దామనుకున్నాడు ఆ ఫొటోని! కాని, అదంటే తనకి చిన్నప్పట్నించీ చాలా కోపమనే సంగతి వెంటనే జ్ఞాపకం వచ్చి, కోపంగా ఉత్తరాన్ని తీశాడు!

"బావా! ఐదారేళ్ళుగా మనం కలుసుకో లేదు! - నేను ఊహించనంతగా మారి పోయాను కదు బావా? నన్ను, నువ్వుగుర్తు పట్టలేవనే ఊహించాను!

బావా! చిన్నప్పుడు నేను నిన్ను "తమ్ము....", అఁ అఁ....కోపగించకు, ఇప్పుడనడంలేదులే! - అనే దాన్నేగా ఈనాడు నన్ను పెళ్ళిచేసుకోనన్నావుట?

చిన్నతనం చేష్టలకి. పెద్దయినా కూడా కోపం ఉంచుకుంటే ఎలా బావా?— పోనీ నాకేం తక్కువ? ఫొటో చూశావు! పి. యు. సి. ప్యాసయ్యాను— వీణ బాగా వాయిస్తాను (అలాగని మా గురువుగారు అంటార్లే). పైగా ఎంబ్రాయిడరీ. కుట్టుపని వంటపని కూడా బాగానేవచ్చు! సినిమా పాటలు కూడావచ్చు! ప్రతి ఆది వారం. ఉదయం ఆటలు తప్పకుండా చూస్తాను!.... జడ ఒదులుగానే అల్లుకో గలను: (బాబ్డ్ హైర్‌కి బామ్మ సుతరామూ ఒప్పుకోడంలేదు?) లిప్‌స్టిక్‌లూ, నైల్‌స్టిక్‌లూ లాంటివికూడా ఒద్దులే!(తాంబూలం, గోరింటాకులే మంచివని, బామ్మేఅంటుంది! మరి- ఇంకా బోలెడు క్వాలిఫికేషనులు ఉన్నాయి!

'బావా! అందుచేత, చిన్నతనం అల్లర్లూ, అవీ మరచిపోయి ...ఏం.... మరి. తెలవా?!

నీ ప్రియమైన మరదలు,
మంగతాయారు.

పి. ఎస్::ఇక మీద నిన్ను "త....", అని పిలవనని హామీ ఇస్తున్నాను. "శ్రీవారూ" అంటాను పెళ్ళవగానే!

ఉంటా,
నీ- మంగమ్మ"

ఉత్తరం అంతా చదివినా మా తమ్ముడి కోపం పోలేదు! కాయితం, కలం తీసుకొని—

"తాయారూ!

నీ ఉత్తరం అందింది! ఇంకా నాతో ఆడుకొని, కోపాన్ని ఎక్కువచేస్తున్నావు! నిన్ను పెళ్ళిచేసుకోడం. కలలో మాట!.... అంతే!....ఆ

శంకరం."

అని మూడు ముక్కలురాసి. పోస్టుచేసి. చేతులు దులుపుకున్నాడు! తిరుగు టపాలోనే తాయారు దగ్గర్నుంచి జవాబు వచ్చేసింది!

"బావా!

నువ్వంతగా కోపగిస్తే ఏం చెయ్యను!.... పోనీ....నా ఖర్మ, నీ దురదృష్టం!— మా మేనత్త కొడుకుతో నాకు పెళ్ళి నిశ్చయం చేశారు! ముహూర్తంకూడా పెడుతున్నారు! శుభలేఖ పంపుతాను! పెళ్ళికి వస్తావుకదూ! తప్పకుండా రావాలి!

నీ - తాయారు!"

"హుఁ! మేనత్త కొడుకుని గాకపోతే, మేనత్తనే చేసుకో! ఎవడిక్కావాలి?— పెళ్ళికి రావాలిట! పోనీలే, వెడితే తప్పు లేదు!" అనుకుని, పెళ్ళి తప్పిపోయింది కదా అని, ఆనందించి, బీడీ ముట్టించాడు.

తాయారు శుభలేఖపంపింది! చూడకూడదను కుంటూనే, చూశాడు మా శంకరం. వరుడిపేరు చూసి, నిశ్చేష్టుడయి పోయాడు! రెండు గ్లాసులమంచినీళ్ళు గడగడా తాగేసి,

"ఊఁ!....సరే!.... ఇంక మనమేం చేస్తాం?" అనుకున్నాడు, లోలోపల ఆనందిస్తూనే.

పెళ్ళి జరిగిపోయింది! ఆరాత్రి—

"మంగా! మొత్తానికి ఖలేదానివే!" మా తమ్ముడిగొంతు!

"ఊఁ! మరేమనుకున్నారు?"

"ఉష్"....!

చెవులు రిక్కించుకువిన్నా. తర్వాత ఆ గదిలోంచి మరేం వినపడలేదు!! □□□






# ఎవరి పత్రిక వారి—

ఎస్.వి.యల్

ఈమధ్య ఏదో అమెరికన్ మాగజైనులో చూశాను: "వోన్ యువర్ వోన్ కార్" అన్న ప్రకటన. అది చదవగానే "వోన్ యువర్ వోన్ పేపర్" అని మనదేశంలో పత్రికలన్నీ ప్రచారంచేస్తే నాలాటి పత్రికా పఠన వ్యసనంవున్న వాళ్ళంతా మహా సంతోషిస్తా రనిపించింది. అటు ఆ పత్రికల అమ్మకం కూడా పెరుగుతుంది. అలా అనడంలో నా స్వార్థం లేదని కాదు సుమండీ.

మా యింటి ఆవరణలో అంతా కలిసి మూడు నాలుగు కుటుంబాలు వుంటున్నాం. అందరికి వీధి ద్వారం ఒకటే. (అదే అన్ని అనర్థాలకీ కారణం). నేను ఆ యింటిలో ప్రవేశించక పూర్వం ఆ ప్రక్కింటి రామారావుగారు రోజూ పేపరు తెప్పించే వారట. నేను వచ్చాక ఆయన "ఎకానమీ డ్రైవ్" మొదలెట్టాడు. తత్ఫలితంగా నా పేపరే ఆ మూడు నాలుగు కుటుంబాలకీ దుబారా లేకుండా చేస్తోంది.

పేపరు కుర్రాడు యిలా "పేపరుసార్" అని కేక వేస్తాడో లేదో, యీ మూడు



కుటుంబాలలోని వాళ్ళూ పరుగెత్తుతారు అందుకునేందుకి (నాపేపరు!) నిజంగా అదొక రన్నింగ్ రేసులావుంటుంది. పెరటిలో ముఖ ప్రక్షాళన చేసుకుంటున్న నేను



వచ్చేసరికి అప్పుడే పేపరు పరహస్తగతం! ఒకసారి నేనూ అలా పరుగెత్తాను. ఫలితం ద్వారానికి ఢీకొని తల బొప్పికట్టింది.



కాని పేపరు చిక్కలేదు. నేను నా స్వంత డబ్బుపెట్టి తెప్పించుకుంటున్న పేపరుమీద వీళ్లు ఎంత అధికారం చెలాయిస్తున్నారో చూడండి. వయస్సులో, అనుభవంలో వాళ్ళు పెద్దలు. గట్టిగా ఏమీ అనలేం. ఒక వేళ అంటే, వాళ్ళావిడ మా ఆవిడని నూతి దగ్గర సాధింపులు. "కాస్త పేపరు యివ్వడానికి అరిగిపోయాడు" అని. ఒక్కోసారి